ADMISSIONS ARE IN PROGRESS 2024-25
Secretary & Correspondent
Bikki Venkateshwarlu
M.Sc (Physicis), M.Ed.
Join your kids with us & Empower their Academic Excellence with Ethical Foundations
INDIRA VIDYALAYA
Nursery to VII class, English Medium
Near Bodrai, Mahabubabad.
Cell: 9701912300, 9705412300

దిన పత్రిక
# తొలి సమయం
వాస్తవమే గమ్యం.. గమనం...

సంపుటి : 01 సంచిక : 293 శనివారం 19-10-2024 | ఎడిటర్ : వేముల అయోధ్య రాములు | పేజీలు : 4 | వెల : 5 రూ/..



- గ్రూప్-1 ప్రిలిమ్స్ రద్దు చేయాలన్న పిటిషన్లను కొట్టేసిన హైకోర్టు
- మూడోసారి రద్దయితే వ్యవస్థపై విశ్వాసం ఉండదు
- పరీక్షలు జరుగుతాయనే నమ్మకం పోతుంది
- అన్నీ పరిశీలించే నిపుణుల కమిటీ 'కీ' తయారీ
- విస్తృతంగా చర్చించిన తర్వాతే సింగిల్ జడ్జి తీర్పు
- దానిలో జోక్యం చేసుకోవాల్సిన అవసరం లేదు
- ఎస్టీ రిజర్వేషన్ పెంచినా పోస్టులూ పెరిగాయి కదా
- హైకోర్టు డివిజన్ బెంచ్ స్పష్టీకరణ
- గ్రూప్-1 వాయిదా కోరుతూ సుప్రీంలో పిటిషన్

# మెయిన్స్‌కు ఓకే

**తొలి సమయం, ప్రధాన ప్రతినిధి హైదరాబాద్**
గ్రూప్-1 మెయిన్స్ అభ్యర్థులకు ఊరట. మెయిన్స్ పరీక్షల నిర్వహణకు ఉన్న అడ్డంకులను హైకోర్టు తొలగించింది. ప్రిలిమ్స్ (ప్రాథమిక పరీక్ష)ను రద్దు చేయాలని, ఫైనల్ కీలో తప్పులున్నాయని, రీ నోటిఫికేషన్ ఇవ్వడం చెల్లదని, ఎస్టీ రిజర్వేషన్ల పెంపు చెల్లదంటూ వివిధ కారణాలతో దాఖలైన పలు అప్పీల్ పిటిషన్లను హైకోర్టు ధర్మాసనం కొట్టేసింది. ఈ సందర్భంగా.. 'మెయిన్స్ పరీక్షలకు ఇప్పటికే అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. 90 శాతం మంది అభ్యర్థులు హాల్ టికెట్లు కూడా డౌన్‌లోడ్ చేసుకున్నారు. ఇప్పటికే రెండుసార్లు ప్రిలిమ్స్ పరీక్ష రద్దయింది. మూడోసారి కూడా రద్దయితే వ్యవస్థపై విశ్వాసమే పోతుంది. పరీక్షలు జరుగుతాయనే నమ్మకం అభ్యర్థులకు కలగదు. తీవ్ర నైరాశ్యం నెలకొని ఆత్మహత్య ఘటనలు జరిగే అవకాశం ఉంటుంది" అని వ్యాఖ్యానించింది. అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకుని, విస్తృతంగా చర్చించే సింగిల్ జడ్జి తీర్పు ఇచ్చారని, అందులో జోక్యం చేసుకోవాల్సిన ఎలాంటి కారణాలు కనిపించడం లేదని స్పష్టం చేసింది. ప్రశ్నల్లో తప్పొప్పులను కోర్టులు నిర్ణయించలేవని, అన్నీ పరిశీలించిన తర్వాతే నిపుణుల కమిటీ 'కీ' విడుదల చేసిందని వివరించింది.

ఎస్టీ రిజర్వేషన్ పెరిగినా.. పోస్టులు కూడా పెరిగాయని గుర్తు చేసింది. గ్రూప్-1 ప్రిలిమ్స్ ప్రశ్నపత్రంలో తప్పులు ఉన్నాయని, దానిని రద్దు చేయడంతోపాటు మెయిన్స్ పరీక్షలను అడ్డుకోవాలని దాఖలైన పిటిషన్లను ఈనెల 15న సింగిల్ జడ్జి ధర్మాసనం కొట్టేసిన విష యం తెలిసిందే. సింగిల్ జడ్జి తీర్పును కొట్టేసి మెయిన్స్ పరీక్షలను అడ్డుకోవాలని కోరుతూ డివిజన్ బెంచ్‌లో అప్పీళ్లు దాఖలయ్యాయి. వీటిపై జస్టిస్ అభినందన్ కుమార్ షావిలి, జస్టిస్ అలిశెట్టి లక్ష్మీనారాయణ ధర్మాసనం శుక్రవారం విచారణ చేపట్టింది. పిటిషనర్ల తరఫు న్యాయవాదులు తమ వాదనలు వినిపిస్తూ.. "ప్రిలిమ్స్ ఫైనల్ కీ తప్పులతడకగా ఉంది. పలు ప్రశ్నలపై అభ్యర్థులు వ్యక్తం చేసిన అభ్యంతరాలను నిపుణుల కమిటీ పరిగణనలోకి తీసుకోలేదు. ఆ కమిటీ ఇచ్చిన కీని పక్కనపెట్టి స్వతంత్ర నిపుణుల కమిటీ వేయాలి. ఒరిజినల్ నోటిఫికేషన్‌లో లేకుండానే ఎస్టీ రిజర్వేషన్‌ను 6 నుంచి 10 శాతానికి పెంచారు. దీనివల్ల మిగతా అభ్యర్థులకు అన్యాయం జరుగు తుంది. 2022లో అర్హత సాధించని వారు 2024లో అర్హత సాధి ంచారు. దరఖాస్తులకు గడువు పొడిగించేది లేదని నోటిఫికేషన్‌లో పేర్కొని రెండు రోజులు పొడిగించారు. మెయిన్స్ పరీక్షలు, రిక్రూట్‌మెంట్ ప్రాసెసను తర్వాత చేపట్టాలి" అని కోరారు.

## బండి సంజయ్‌తో గ్రూప్-1 అభ్యర్థుల భేటీ

### తమకు అండగా నిలవాలని వినతి

**తొలి సమయం, కరీంనగర్,అక్టోబర్18:** గ్రూప్-1 పరీక్షలను రీషెడ్యూల్ చేయాలని ఆందోళనకు దిగిన అభ్యర్థులపై కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరుపై కేంద్రమంత్రి బండి సంజయ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రూప్-1 అభ్యర్థులు పలువురు కరీంనగర్‌లోని బండి సంజయ్ నివాసానికి వెళ్లి కలుసుకున్నారు. మెయిన్స్ పరీక్షలను వాయిదా వేయడంలో తమకు సాయం చేయాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా గ్రూప్స్ అభ్యర్థుల ఆందోళనకు ఆయన సంపూర్ణ మద్దతు ప్రకటించారు. గ్రూప్-1 అభ్యర్థులపై లాఠీచార్జ్ చేయడం దారుణమని బండి సంజయ్ అన్నారు.



న్యాయం కోరితే రక్తం కళ్లజూస్తారా అని మండిపడ్డారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్లకు జీవో 29 గొడ్డలి పెట్టు అని ఆయన వ్యాఖ్యానించారు. గ్రూప్ ? 1 అభ్యర్థుల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం రాక్షసంగా వ్యవహరిస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రూప్ -1 పరీక్షలను రీషెడ్యూల్ చేయాల్సిందేనని డిమాండ్ చేశారు. అశోక్ నగర్ నుంచి ఉద్యమం తెలంగాణ అంతా వ్యాపిస్తుందని హెచ్చరించారు. సమస్య తీవ్రం కాకముందే ప్రభుత్వం దిగిరావాలని సూచించారు. బీజేపీ రాష్ట్ర నాయకత్వం అదేశాల మేరకు అశోక్ నగర్ వెళ్లి గ్రూప్-1 అభ్యర్థులను కలుసుకుంటానని చెప్పారు.

## స్కిల్ వర్సిటీకి ఆదానీ గ్రూప్ భారీ విరాళం


### వందకోట్ల చెక్కును స్వయంగా అందించిన ఆదానీ
### హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌ను కలిసి అందచేత



**తొలి సమయం, హైదరాబాద్,అక్టోబర్18:** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ఏర్పాటు చేసిన యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీకి అదానీ గ్రూప్ భారీ విరాళం ప్రకటించింది. అదానీ గ్రూప్ ఛైర్మన్ గౌతమ్ అదానీ శుక్రవారం హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి రూ.100 కోట్ల చెక్కును అందజేశారు. సీఎస్ శాంతి కుమారి, పురపాలక ముఖ్యకార్యదర్శి దానకిశోర్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు. యువతకు నైపుణ్యాలు నేర్పించేలా రంగారెడ్డి జిల్లాలో ముచ్చర్లలోని బేగరికంచెలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. ఇటీవల సీఎం రేవంత్ రెడ్డి ఈ వర్సిటీకి శంకుస్థాపన చేశారు. దీనికి మహీంద్రా గ్రూప్ ఛైర్మన్ ఆనంద్ మహీంద్రాను ఛైర్మన్‌గా నియమించారు. 17 రకాల కోర్సుల్లో యువతకు శిక్షణ ఇచ్చి ప్రైవేటు సంస్థల్లో ఉపాధి అవకాశాలు కల్పించనున్నారు. ఏటా లక్షమందికి శిక్షణ ఇచ్చేలా రాబోయే కాలంలో ఈ వర్సిటీని విస్తరించనున్నారు. బేగరికంచెలో సొంత భవనం పూర్తయ్యే వరకు గచ్చిబౌలిలోని ఇంజినీరింగ్ స్టాఫ్ కాలేజీ ఆఫ్ ఇండియా భవనంలో వర్సిటీ కార్యకలాపాలు కొనసాగనున్నాయి. ఈ ఏడాది నుంచే ప్రవేశాలు కల్పించే ఉద్దేశంతో ఇప్పటికే దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. నవంబరు 4వ తేదీ నుంచి స్కిల్ యూనివర్సిటీలో కోర్సులు ప్రారంభం కానున్నాయి. ప్రస్తుతానికి ప్రాధాన్యం ఉన్న ఆరు కోర్సులతో మొదలు పెట్టి క్రమంగా కోర్సులను పెంచనున్నారు. ఈ వర్సిటీకి ప్రముఖ పారిశ్రామికవేత్త ఆనంద్‌మహీంద్రా ఛైర్మన్‌గా వ్యవహరిస్తున్నారు.

## ఆప్ నేత సత్యేంద్ర జైన్‌కు భారీ ఉరట

### రెండేళ్ల తరవాత ఢిల్లీ కోర్టు బెయిల్ మంజూరు




**న్యూఢిల్లీ,అక్టోబర్18:** ఆప్ సీనియర్ నేత, ఢిల్లీ ఆరోగ్యశాఖ మాజీ మంత్రి సత్యేందర్ జైన్ కు భారీ ఊరట లభించింది. మనీలాండరింగ్ కేసులో అరెస్టయిన రెండేళ్ల తర్వాత బెయిల్ వచ్చింది. శు క్రవారం ఢిల్లీ కోర్టు ఆయనకు బెయిల్ మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. కోల్‌కతాకు చెందిన ఓ కంపెనీకి సంబంధించి లావాదేవీల విషయంలో మనీలాండరింగ్‌కు పాల్పడ్డారన్న ఆరోపణలపై 2022 మే 30న సత్యేందర్ జైన్‌ను ఈడీ అధికారులు అరెస్టు చేసిన విషయం తెలి సిందే. 2015-16 సమయంలో హవాలా నెట్‌వర్క్ ద్వారా జైన్ కంపెనీలకు.. షెల్ కంపెనీల నుంచి సుమారు రూ.4.81 కోట్ల వరకు ముట్టినట్లు ఈడీ దర్యాప్తులో గుర్తిం చింది. సీబీఐ నమోదు చేసిన ఎఫ్ఐఆర్ ఆధారంగా రంగంలోకి దిగిన ఈడీ అధికా రులు.. ఈ హవాలా కేసును దర్యాప్తు చేశారు. ఈ క్రమంలోనే సత్యేందర్‌తో పాటు ఆయన కుటుంబానికి చెందిన రూ.4.81 కోట్ల విలువైన ఆస్తులను అటాచ్ చేసి ఆయన్ను అదుపులోకి తీసుకున్నారు. ఈ క్రమంలో వైద్య కారణాలతో గత ఏడాది మేలో సుప్రీంకోర్టు ఆయనకు తాత్కాలిక బెయిల్ ఇచ్చింది. అయితే రెగ్యులర్ బెయిల్ ఇచ్చేందుకు నిరాకరించడంతో తిరిగి మళ్లీ తిహాడ్ జైలుకు వెళ్లాల్సి వచ్చింది.

## పలు యూనివర్సిటీలకు విసిల నియామకం

- ఓయూ విసిగా ఎం కుమార్
- తెలుగు వర్సిటీ విసిగా నిత్యానందరావు
- ఉత్తర్వులు జారీ చేసిన గవర్నర్







**తొలి సమయం, హైదరాబాద్,అక్టోబర్18:** తెలంగాణలో పలు యూనివర్సిటీలకు కొత్త వైస్ చాన్సలర్స్ లను నియమిస్తూ శుక్రవారం రాష్ట్ర గవర్నర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఏడాది మార్చి 21తో విసిల పదవీకాలం ముగియడంతో ప్రస్తుతం అన్ని యూనివర్శిటీలకు ఇన్‌చార్జ్ విసిలుగా ఐఎఎస్‌లు వ్యవహరిస్తున్నారు. బాసర ట్రిపుల్ ఐటి, మహిళా యూని వర్శిటీ మినహా రాష్ట్ర వ్యాప్తంగా మిగిలిన 10 యూనివర్శిటీలకు తెలంగాణ ప్రభుత్వం గతంలో సెర్చ్ కమిటీలను నియమించింది. ఈ కమిటీలు దరఖాస్తులను పరిశీలించి ఒక్కో యూనివర్శిటీకి ముగ్గురి పేర్లను గవర్నర్‌కి సిఫారసు చేస్తాయి. పది విసి పోస్టులకు 312 మంది దరఖాస్తు చేసుకున్నారు. కొత్తగా నియమితులైె విసిల్లో అనుభవం, కులాలను పరిగణనలోకి తీసుకున్నట్లు అర్థం అవుతోంది. ఇందులో పాలమూరు యూని వర్శిటీ విసిగా జి.ఎస్. శ్రీనివాస్, కాకతీయ యూనివర్శిటీ విసిగా ప్రతాప్ రెడ్డి, ఉస్మానియా యూనివర్శిటీ విసిగా ఎం. కుమార్, శాతవా హన వర్శిటీ విసిగా ఉమే ష్ కుమార్‌తెలుగు వర్సిటీ విసిగా నిత్యానందరావు, మహాత్మాగాంధీ వర్శిటీ విసిగా అల్తాఫ్ హుస్సేన్, తెలంగాణ యూనివర్శిటీ విసిగా యాదగిరి రావు, జయశంకర్ వర్శిటీ విసిగా జానయ్య,శ్రీ కొండా లక్ష్మణ్ బాపూజీ తెలంగాణ హార్టీకల్చర్ వర్శిటీ విసిగా రాజిరెడ్డిలు నియమితులయ్యారు. ప్రభుత్వ సూచనలతో గవర్నర్ జిష్ణుదేవ్ శర్మ ఉత్తర్వులు జారీ చేశారు. కాగా.. తెలంగాణలో చాలా కాలంగా వీసీల పోస్టులు ఖాళీగా ఉన్న విషయం తెలిసిందే. దాదాపు ఏడాదిన్నర కాలంగా వీసీలు లేకుండా పోయారు. అంతేకాదు ఇన్‌చార్జ్ వీసీలుగా సీనియర్ ఐఏఎస్‌లను నియమించినప్పటికీ వర్సిటీలో పరిస్థితి ఏమాత్రం మారలేదు. వీసీలు లేక అనేక యూనివర్సిటీల్లో పాలన గాడి తప్పిన ట్లైంది. పలు వర్సిటీల్లో అక్రమాలు జరిగాయని కూడా ఆరోపణలు వచ్చాయి. సరైన వసతులు లేక అనేకసార్లు విద్యార్థులు ఆందోళన బాట పట్టిన విషయం తెలిసిందే. తమ సమస్యలు పరిష్కరించాలని కొత్త వీసీలను నియమించాలని విద్యార్థులు పట్టుబట్టినప్పటికీ ఫలి తం లేకుండా పోయింది. వసతి గృహాల్లో పరిస్థితి మరీ అధ్వాన్నంగా మారింది. హాస్టల్స్‌లో సరైన భోజన సదుపాయం లేక, నాణ్యమైన ఆహారం లేక విద్యార్థులు అవస్థలు పడ్డ సందర్భాలు ఎన్నో. అంతేకా కుండా హాస్టల్స్‌లో విషపు పురుగులు తిరుగుతుండటంతో విద్యార్థులు మరింత భయాందోళనకు గురైన పరిస్థితులు ఉన్నాయి. అలాగే వీసీ పోస్టుల కోసం అనేక మంది ప్రొఫెసర్లు పైరవీలు చేసినట్లు సమాచారం. చివరకు ఎట్టకేలకు వీసీల నియామకంలో ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. తొమ్మిది యూనివర్సిటీలకు వీసీలను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

## పోలీస్ తరహాలో ఆర్‌బిఐ తీరు ఉండదు: గవర్నర్

**ముంబయి,అక్టోబర్18:** పోలీసుల మాదిరిగా రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వ్యవహరించలేదని ఆర్బీఐ గవర్నర్ శక్తికాంత దాస్ పేర్కొన్నారు. తమకంటూ పరిమితులు ఉన్నాయని అన్నారు. కానీ, ఫైనాన్షియల్ మార్కెట్‌పై మాత్రం గట్టి నిఘా ఉంచడంతోపాటు అవసరమైనప్పుడు నియంత్రణ చర్యలు తీసుకుంటుందన్నారు. నవీ ఫిన్‌సర్వ్ లిమిటెడ్ సహా నాలుగు సంస్థలు రుణాలు మంజూరు చేయకుండా ఆంక్షలు విధించిన మరుసటి రోజు ఆర్‌బీఐ చీఫ్ ఈ విధంగా వ్యాఖ్యానించారు. ఫ్లిప్‌కార్ట్ వ్యవస్థాపకుల్లో ఒకరైన సచిన్ బన్సల్‌కు చెందిన నవీ ఫిన్‌సర్వ్ లిమిటెడ్‌తో సహా నాలుగు నాన్-బ్యాంకింగ్ ఫైనాన్షియల్ సంస్థలపై ఆర్‌బీఐ ఆంక్షలు విధించింది.



## యాదగిరిగుట్టలో భక్తులకు సౌకర్యాలు మెరుగు

### మంత్రి కొండా సురేఖ వెల్లడి

**తొలి సమయం, హైదరాబాద్,అక్టోబర్18:** యాదగిరిగుట్టలో భక్తుల సౌకర్యార్థం దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక చర్యలు తీసుకున్నామని మంత్రి కొండా సురేఖ అన్నారు. ఆలయంలో 14చోట్ల మంచినీటి సౌకర్యం ఏర్పాటు చేశామని తెలిపారు. 47 చోట్ల టాయిలెట్స్ నిర్మించినట్లు చెప్పారు. విష్ణు పుష్కరిణీ గుండాన్ని ఏర్పాటు చేశామన్నారు. చంటి బిడ్డ తల్లులకు ప్రత్యేక లాంజ్‌లు, ఎలక్ట్రిక్ వాహనాల సౌకర్యం కల్పించామని చెప్పారు. రూ. 15కోట్లతో దాతల సహాయంతో అన్నదాన సత్రం నిర్మించామని మంత్రి కొండా సురేఖ అన్నారు. 60కిలోల బంగారు తాపడంతో రాజగోపురం నిర్మించాలని నిర్ణయించినట్లు తెలిపారు. లడ్డూ నాణ్యతలో జాగ్రత్తలు తీసుకుంటున్నామని అన్నారు. భద్రాద్రి అభివృద్ధి కోసం కొత్త మాస్టర్ ఎ÷-లాన్ సిద్ధం చేస్తున్నామని అన్నారు. రూ. 3కోట్లతో జానకి సదనం నిర్మిస్తున్నామని తెలిపారు. దేవాలయానికి సంబంధించిన 24సేవలు ఆన్ లైన్?లో అందిస్తున్నామని ప్రకటించారు. వేములవాడ దేవస్థానానికి చెందిన 850కోడెలను రైతులకు అందించినట్లు మంత్రి కొండా సురేఖ స్పష్టం చేశారు. టీటీడీఏ(÷ఆం) కు ప్రభుత్వం రూ. 70 కోట్లు విడుదల చేసిందని ప్రకటించారు. వెండి పల్లకీలు, బంగారు తాపడం రాజగోపురం నిర్మించాలని నిర్ణయించామన్నారు.

# ఉపాధి రంగాలను బలోపేతం చేయాలి !

**తొలి సమయం హైదరాబాద్,**

తెలుగు రాష్ట్రాల్లో నిరుద్యోగ సమస్య తీవ్రంగా ఉంది. సమస్య కొండంతగా ఉంటే చర్యలు మాత్రం గోరంత అన్నచందంగా ఉన్నాయి. మరోవైపు ఐటి కంపెనీల్లో తీసివేతలు పెరుగుతున్నాయి. స్కిల్ లేకపోవడం వల్లనే అని తెలంగాణ సిఎం రేవంత్ ఇటీవలే ప్రకటించి, స్కిల్ వర్సిటీకి పునాది వేశారు. నిజానికి క్షేత్రస్థాయి లోనే విద్యారంగంలో మార్పులు రావాలి. విద్యార్థులు రాటుదేలేలా తర్ఫీదు ఇవ్వాలి. వారు ఎంచుకంటున్న ఆయా రంగాల్లో నిష్ణాతులను తయారు చేయాలి. అప్పుడే వారు ఏ పరిశ్రమలో అయినా రాణిస్తారు. అది ఓ పక్క జరుగుతుండగానే ఉన్న నిరుద్యోగులకు ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలు కల్పించాలి. ఉద్యోగమంటే కేవలం ప్రభుత్వ ఉద్యోగమే కాదు.. ప్రైవేట్ రంగంలోనూ వారికి అవకాశాలు కల్పించాలి. అలాగే సొంతకాళ్ల మీద నిలబడేలా ఉపాధికి అవకాశాలను పెంచాలి. బ్యాంకులు ఇతోధికంగా రుణాలు ఇచ్చేలా చేయాలి. ఇవన్నీ సాకారం కావాలంటే వ్యవసాయరంగం, అనుబంధ రంగాలు బలపడాలి. పారిశ్రామిక రంగం పురోగమించాలి. ఇవన్నీ కూడా యుద్ధప్రాతిపదికన సాగాలి. యువత ఆకాంక్షల మేరకు అవకాశాలు కల్పించే దిశగా ప్రభుత్వాలు కృషి చేయాలి. ఎందుకంటే ఉభయ తెలుగు రాష్ట్రాల్లో కొత్త ప్రభుత్వాలపై ప్రజలు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. ఆంధ్రప్రదేశ్‌లోనూ రాష్ట్రంలో ప్రభుత్వం మారింది. టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. కొత్త ప్రభుత్వం వచ్చింది కాబట్టి నిరుద్యోగుల్లో ఆశ పెరిగింది. కొత్తగా పరిశ్రమలు వస్తాయి. తమకు ఉద్యోగాలు వస్తాయని ఎదురు చూస్తున్నారు. టిడిపి ప్రభుత్వం పారిశ్రామిక అభివృద్ధి విషయంలో గత ప్రభుత్వంతో పోల్చినపుడు కొంత మెరుగుగా పనిచేస్తోంది. ఇప్పటికే తెలంగాణలో సిఎం సహా మంత్రులు అమెరికా తదితర దేశాలు చుట్టివచ్చారు. పరిశ్రమల ఏర్పాటుకు ఆహ్వానాలు పలికారు. ఎపి మంత్రి లోకేశ్ త్వరలో అమెరికా వెళ్లనున్నారు. పారిశ్రామక వేత్తలకు చంద్రబాబ కూడా రెడ్ కార్పెట్ పరిచారు. 'ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' ఎపుడో వచ్చింది. ప్రభుత్వ ఖజానాలో కొంత ప్రైవేటుకు ఇచ్చి ప్రభుత్వ రంగ బ్యాంకుల చేత రుణాలు ఇప్పించిన తరువాత ప్రైవేట్ కంపెనీలు వేసే రోడ్లు, విమానాశ్రయాలు, చేసే విద్యుత్తు ఉత్పత్తి తదితర మౌలిక సౌకర్యాలు ఎవరికి అందుబాటులో ఉన్నాయి? ఎవరి మీద భారాలు పడుతున్నాయన్నది ఆలోచించాలి. పన్నలు సరళీకరణ సాగాలి. చిన్నచిన్న పనులను పెంచాలి. కంపెనీలకు మేలు చేసేలా నిర్ణయాలు ఉండరాదు. ప్రజలకు మేలు చేసేలా విధానాలు ఉండాలి. ఎస్.ఇ.జెడ్ లలో వచ్చిన కంపెనీలకు భూములు ఇచ్చి రైతులు ఆ కంపెనీల్లో కూలీలుగా మారారు. పరిశ్రమల నిర్మాణ సమయంలో వచ్చే, పోయే లారీల్లో దింపుడు, ఎత్తుడు హమాలీలయ్యారు. కోల్‌కొతా- చెన్నరు రహదారి పక్కన తమిళనాడు సరిహద్దులో ఉన్న పేరు మోసిన ఎస్.ఇ.జెడ్.లో భూములు కోల్పోయిన రైతులు గతిలేక ఎస్.ఇ.జెడ్ భూముల్లోకి గొడ్లు రాకుండా చూసుకునే కూలీలుగా మారడానికి కూడా సిద్ధపడుతున్నారు. గంగవరం పోర్టులాంటి వాటికోసం, విశాఖ ఉక్కు కోసం భూములు త్యాగాలు చేసిన వారు ఏమవుతున్నారు. ఈ దిశగా ప్రభుత్వాలు ఆలోచన చేయాలి. తెలంగాణలో మల్లన్నసాగర్, కొండపోచమ్మ సాగర్ లాంటి వాటికి భూములు ఇచ్చిన రైతులు ఇవాళ దిక్కులేకుండా పడివున్నారు. ఇలాంటి అభివృద్ధి ఎవరి కోసమన్నది కూడా ఆలోచన చేయాలి. అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం ఎస్.ఇ.జెడ్ లో ఉన్న ఒక కంపెనీలో భూములు ఇచ్చిన రైతు కుటుంబాలకు చెందిన 70 శాతం మంది కార్మికులుగా చేరారు.

కానీ 12 సంవత్సరాల తర్వాత కూడా కంపెనీ వారిని కార్మికులుగా కూడా గుర్తించడంలేదు. నైపుణ్యాన్ని బట్టి వేతనాలు ఇవ్వలేదు. కంపెనీ చేసిన ఆర్థిక తప్పిదానికి ప్రస్తుతం మూతపడింది. భూములు ఇచ్చిన కార్మికుల రెక్కలు ముక్కలయ్యాయి.ప్రజల భాగస్వామ్యం ఉన్నా ఏమీ మెరుగ్గా ఒరగబెడుతుందో ప్రభుత్వం చెప్పాలి. నిజంగా చెప్పాలంటే ప్రభుత్వాలు ఏకపక్షంగా పెట్టుబడిదారుల ప్రయోజనాల కోసమే పని చేస్తున్నాయి. యూనియన్లు పెట్టుకోనివ్వటం లేదు. అలా ముందుకు వచ్చిన వారిని ఉద్యోగాల నుండి తొలగిస్తున్నారు. ప్రైవేట్ పరిశ్రమల్లో గుర్తింపు ఎన్నికలు మూలపడ్డాయి. తనిఖీలను ఎత్తివేశారు. కార్మికుల భద్రతను గాలికొదిలేశారు. అంటే వెట్టి చాకిరీ చేయించుకునే వ్యవస్థను ప్రభుత్వమే ప్రోత్సహిస్తోందని అర్థం చేసుకోవాలి. నీస వేతన చట్టం ప్రకారం 5 సంవత్సరాలకు ఒకసారి కార్మికులు వేతనాలు పెంచాలి. ఆయా కంపెఈల్లో వేతనాలను కూడా నైపుణ్యాలకు తగినట్లుగా ఇవ్వటం లేదు. అదానీ పోర్టులో కూడా ఇదే పరిస్థితి. కార్మికులను కదలకుండా చేయటానికి పోర్టుల్లో, ఎస్.ఇ.జెడ్ లలో పోలీసు స్టేషన్లు వచ్చాయి. యూనియన్లకు ప్రవేశం లేదు. విడివిడిగా ఉండే ప్రైవేట్ పరిశ్రమలన్నింటిలో కూడా ఇదే పరిస్థితి. అంటే భూములతో పాటు అన్ని వసతులు కల్పిస్తే లాభపడుతున్నది కేవలం పరిశ్రమల యజమానులే తప్ప ప్రజలు కాదని ప్రభుత్వాలు గుర్తించాలి. ఇలాంటి పరిస్థితులు కల్పించే కంపెనీలను దగ్గరకు రాకుండా చూడాలి. ప్రభుత్వమైనా ఆ పథకం ఇస్తాం, ఈ పథకం ఇస్తామని మభ్యపెడుతున్నాయి తప్పిస్తే కార్మికులకు వేతనాలు పెంచుతాం, కార్మిక హక్కులను కాపాడతామని చెప్పటం లేదు. నిజానికి పరిశ్రమలు పెట్టేది ప్రజలకు ఉదద్యోగ ఉపాధి అవకాశాలు పెంచడానికే అని గుర్తించాలి. పెత్తందార్లను తయారు చేసి ప్రజలను వెట్టి చాకీరీ చేయించుకోవడానికి కాదని ప్రభుత్వాలు గుర్తించాలి. అలాంటి వారి కోసం రైతులు ఎందుకు భూములు త్యాగం చేయాలి. ఎందుకు కూలీలుగా మారాలి అన్నది గుర్తించాలి. అలాకాకుండా భూముల్లో బంగారం పండించేలా రైతులను ప్రోత్సహించాలి. వ్యవసాయ అనుబంధ రంగాలను ప్రోత్సహించాలి. పర్యావరణం కూడా పరిగణనలోకి తీసుకోవాలి. అలా చేస్తేనే ఉపాధి ఉద్యోగ రంగాలు బలపడతాయని గుర్తించాలి.

# 20న వారణాసిలో ప్రధాని పర్యటన

## పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు

**వారణాసి, అక్టోబర్18:** భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అక్టోబర్ 20న తన సొంత పార్లమెంటరీ నియోజకవర్గమైన వారణాసిలో పర్యటించనున్నారు. సుమారు ఆరు గంటలపాటు కాశీలోనే బస చేయనున్నారు. ఉత్తరాదిన పెద్ద పండుగగా జరుపుకునే దీపావళి పర్వదినానికి కొద్ది రోజుల ముందే వారణాసితో సహా దేశవ్యాప్తంగా రూ. 3,254.03 కోట్ల విలువైన ప్రాజెక్ట్‌లను చేపట్టనున్నారు. రూ.380.13 కోట్లతో 15 ప్రాజెక్టులకు ప్రారంభోత్సవం, రూ.2,874.17 కోట్లతో రెండు ప్రాజెక్టులకు శంకుస్థాపన చేయనున్నారు. వారణాసి పర్యటనలో భాగంగా ప్రధాని మోదీ సిగ్రా స్పోర్ట్స్ స్టేడియంలో బహిరంగ సభలో కూడా ప్రసంగిస్తారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ వారణాసి నుంచే దేశంలోని 6 విమానాశ్రయాలను అభివృద్ధి చేసే ప్రాజెక్టులను ప్రారంభిస్తారు. బాగ్‌డోగ్రా (బెంగాల్), దర్భంగా (బీహార్), ఆగ్రా (యూపీ) విమానాశ్రయాల్లో కొత్త సివిల్ ఎన్‌క్లేవ్‌ల నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నారు. వాటి అంచనా వ్యయం రూ.3,041 కోట్లు. ఇది కాకుండా, రేవా ఎయిర్‌పోర్ట్‌లో కొత్త



టెర్మినల్ బిల్డింగ్ నిర్మాణం, మా మహామాయ ఎయిర్‌పోర్ట్ అంబికాపూర్‌లో కొత్త టెర్మినల్ బిల్డింగ్ నిర్మాణం, సర్సావా ఎయిర్‌పోర్ట్‌లో సివిల్ ఎన్‌క్లేవ్ నిర్మాణ ప్రాజెక్టులను ఆయన వర్చువల్ విధానంలో ప్రారంభిస్తారు. వీటి కోసం రూ.255.18 కోట్లు ఖర్చు చేయనున్నారు.

# ద్వారకా తిరుమలలో వైభవంగా బ్రహ్మోత్సవాలు

## రాజమన్నార్ అలంకరణలో దర్శనమిచ్చిన స్వామి


**ఏలూరు, అక్టోబర్18:** ఏలూరు జిల్లాలోని లోని ప్రముఖ పుణ్య క్షేత్రం ద్వారకా తిరుమల చిన తిరుపతిలో ఆశ్వయుజ మాస బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. 6 వ రోజు శుక్రవారం చిన వెంకన్న రాజమన్నార్ అలంకరణలో భక్తులకు దర్శనమిస్తున్నారు. అలాగే రాత్రి 7 గంటలకు స్వామి వారి రథోత్సవం జరగనుంది.కాగా ద్వారకా తిరుమలలో ఏడాదిలో రెండు సార్లు బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తారు. ఒకసారి వైశాఖమాసంలో, మరోసారి అశ్వయుజ మాసంలో స్వామివారికి వైభవంగా బ్రహ్మోత్సవాలు జరుపుతారు. ఈ బ్రహ్మోత్సవాలను ఎనిమిది రోజులపాటు ఘనంగా నిర్వహిస్తారు. శుక్రవారం ద్వారకా తిరుమలలోని మాఢ వీధుల్లో స్వామివారి రథోత్సవం నిర్వహిస్తారు. అశ్వయుజ మాస బ్రహ్మోత్సవాలు జరిగే 8 రోజులపాటు వివిధ వాహనాలపై స్వామి, అమ్మవార్లు భక్తులకు దర్శనం ఇస్తారు. కాగా శనివారం ఉదయం ఏడు గంటలకు చక్రస్నానం, రాత్రి ఏడు గంటలకు శ్రీవారి ధ్వజావరోహణ కార్యక్రమాలు జరుగుతాయి.కాగా గురువారం చిన వెంకన్న కల్యాణం తంతును అర్చకులు వైభవంగా నిర్వహించారు. సర్వాభరణ భూషితుడై, పెండ్లి కుమారుడిగా సర్వజగరకుడైన శ్రీవారు. బుగ్గన దుక్కలతో సిగ్గులొలుకుతున్న అలివేలు మంగ ఆండాళ్. దేవేరులను పరిణయమాడారు.

ఈ కల్యాణ ఘడియలో స్వామి చిన్న మంగళ స్వరూపాన్ని వీక్షించి భక్తులు తరించారు. ఈ బద్భుత దృశ్యం ద్వారకాతిరుమల వేంకటేశ్వరస్వామి ఆలయంలో గురువారం రాత్రి ఆవిష్కృతమైంది. తొలుత రాత్రి తొక్కు వాహనంపై శ్రీవారు,అమ్మవార్ల కల్యాణమూర్తులను, ఉంచి అలంకరించి ఆట అనివేటి మండపంలో ఏర్పాటు. చేసిన వేదిక దగ్గరకు తీసుకొన్ని అక్కడ బంగారు సింహాసనంపై కళ్యాణమూర్తులను ఉంచి అర్చకులు కళ్యాణ తంతును ప్రారంభించారు. పాంచాహ్నిక దీక్షతో వైఖానస ఆగమాన్ని అనుసరించి జరిగిన ఈ కల్యాణ తంతులో ఆలయ అర్చకులు ముందుగా శాంతి హోమాన్ని చేసి సర్వదేవతారాధన. సంకటం, కరణ పూజలు నిర్వహించారు. దేవస్థానం తరపున ఆలయ చైర్మన్ రాజా ఎస్వీ సుధాకరరావు ప్రభుత్వం తరపున గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు స్వామి అమ్మ వార్లకు పట్టువస్త్రాలు అందించారు. ఆ తర్వాత అర్చకులు స్వామి, అమ్మవార్లకు పట్టు వస్త్రాలు తీసుకువస్తున్న చైర్మన్ సుధాకరరావు, ఎమ్మెల్యే మద్దిపాటి, ట్రస్ట్ విద్యుతరావు మూర్తులకు మధువర్యాలను సమర్పించారు సుముహూర్త సమయంలో నూతన వధూవరుల శిరస్సులపై జీలకర్ర, బెల్లం ధరింపచేసి భక్తుల గోవిందనామ స్మరణల నడుమ మాంగల్య చారణ, తలంబ్రాలు వైభవోపేతంగా జరిపించారు. అలండు ఈవో ఎస్వీఎస్ఎన్ మూర్తి కల్యాణ ఏర్పాట్లను పర్యవేక్షించగా, ఈఈ భాస్కర్ పాల్గొన్నారు.

# బాలీవుడ్ నటుడు సల్మాన్ ఖాన్‌కు బెదిరింపులు

**5కోట్లు డిమాండ్ చేస్తూ పోలీసులకు మెసేజ్**

**అప్రమత్తం అయిన పోలీసులు..మెసేజ్‌పై ఆరా**




**ముంబై,అక్టోబర్18:** బాలీవుడ్ నటుడు సల్మాన్‌ఖాన్‌కు మరో సారి బెదిరింపులు వచ్చాయి. లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్‌తో ఉన్న వైరానికి ముగింపు పలకాలంటే రూ.5 కోట్లు ఇవ్వాలంటూ అగంతకులు బెదిరింపులకు పాల్పడ్డారు. ముంబయి ట్రాఫిక్ పోలీసుల వాట్సప్ నంబర్‌కు ఈ మెసేజ్ రావడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. గురువారం రాత్రి ముంబయి ట్రాఫిక్ పోలీసులకు ఈ మెసేజ్ వచ్చింది. 'ఈ బెదిరింపులను తేలిగ్గా తీసుకోవద్దు. సల్మాన్ ఖాన్ ప్రాణాలతో ఉండాలన్నా.. లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్‌తో శత్రుత్వాన్ని ముగించుకోవాలన్నా ఆయన రూ.5కోట్లు చెల్లించాలి. ఈ డబ్బులు ఇవ్వకపోతే ఇటీవల హత్యకు గురైన మాజీ ఎమ్మెల్యే సిద్ధిఖీ కంటే ఆయన దారుణమైన పరిస్థితులు ఎదుర్కోవాల్సి ఉంటుందని దుండగులు అందులో బెదిరించారు. దీనిపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ప్రారంభించామని, మెసేజ్ ఎక్కడినుంచి వచ్చిందన్న దానిపై విచారణ జరుపుతున్నామని ముంబయి పోలీసులు వెల్లడించారు. ఈనేపథ్యంలో బాంద్రాలోని ఆయన నివాసం వద్ద భద్రతను కట్టుదిట్టం చేశారు. కాగా.. సల్మాన్‌ఖాన్‌కు ఇలా బెదిరింపులు రావడం ఇదే తొలిసారి కాదు. గతంలోనూ పలుమార్లు బిష్ణోయ్ గ్యాంగ్ నుంచి ఆయనకు బెదిరింపులు వచ్చాయి. ఈ ఏడాది ఏప్రిల్‌లో సల్మాన్ నివాసం ఉంటున్న బాంద్రాలోని గెలాక్సీ అపార్ట్‌మెంట్ వద్ద ఇద్దరు వ్యక్తులు కాల్పులు జరిపిన సంగతి తెలిసిందే. ఇక, అంతకుముందు పన్వేల్ ఫామ్‌హౌస్‌లోకి చొరబడేందుకు కొందరు ప్రయత్నించడం అప్పట్లో కలకలం రేపింది. నటుడి ప్రాణాలకు ముప్పు పొంచి ఉన్న నేపథ్యంలో గతేడాది మహారాష్ట్ర ప్రభుత్వం ఆయనకు భద్రతను పెంచింది. ఇదిలాఉండగా.. సల్మాన్ ఖాన్ స్నేహితుడు, ఎన్సీపీ నేత బాబా సిద్ధిఖీ గతవారం దారుణ హత్యకు గురైన సంగతి తెలిసిందే. ముంబయిలోని బాంద్రాలో తన కుమారుడి కార్యాలయంలో ఉండగా.. ముగ్గురు దుండగులు సిద్ధిఖీపై మూడు రౌండ్లు కాల్పులు జరిపారు. వెంటనే ఆయన్ను లీలావతి ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మృతి చెందారు. ఈ హత్య తామే చేసినట్లు బిష్ణోయ్ గ్యాంగ్ ప్రకటించుకుంది.

# పాలన చేతకాని కాంగ్రెస్ ప్రభుత్వం

**మూసీ చుట్టూ ముఖ్యమంత్రి ప్రదక్షిణం**

**ట్విట్టర్ వేదికగా కెటిఆర్ విమర్శలు**



**హైదరాబాద్,అక్టోబర్18:** తెలంగాణ అభివృద్ధి, పాలన చేతకాకే కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం రేవంత్ రెడ్డి మూసీ చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. పాలన చేతకాకే పనికిమాలిన మాటలు, పాగల్ పనులు చేస్తున్నారని ధ్వజమెత్తారు. తెలంగాణ రాష్ట్రంలో పాలన పిచ్చోడి చేతిలో రాయిలా మారిందని ఎద్దేవా చేశారు. ఈ మేరకు ట్విటర్ వేదికగా కాంగ్రెస్ ప్రభుత్వంపై కేటీఆర్ తీవ్ర విమర్శలు గుప్పించారు. ఆడలేక మద్దెల ఓడు అన్నట్లు పరిపాలన, అభివృద్ధి చేయడం తెలియక మూసీ మురుగులో కాంగ్రెస్ పార్టీ పొర్లుతోందని ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఆ పార్టీ నేతలు తమకు అంటిన మూసీ బురదను అందరికీ అందించాలని చూస్తున్నారని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మూసీ ప్రాజెక్టుతోనే హైదరాబాద్ అభివృద్ధి అవుతుందని చెప్పే తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి తెలుసుకోవాల్సింది చాలా ఉంది. మూసీ ప్రాజెక్టుతో సంబంధం లేకుండానే తలసరి ఆదాయంలో (పర్ క్యాపిటా) తెలంగాణ దేశంలోనే నంబర్ వన్ అయ్యింది. మూసీ ప్రాజెక్టులో రూ.1.50 లక్షల కోట్లు దోచుకోకుండానే జీడీపీ అభివృద్ధిలో రాష్ట్రం దేశంలోనే అగ్రస్థానం సాధించింది. బిల్డర్లు, రియల్టర్లను బెదిరించకుండానే ఐటీ ఎగుమతుల్లో బెంగళూరును హైదరాబాద్ దాటేసింది. మీ బడే భాయ్ మోదీ ఐటీఐఆర్ ని రద్దు చేసినా, తెలంగాణకు ఒక్క రూపాయీ సహాయం చేయకపోయినా, ఐటీ ఎగుమతుల విషయంలో 2035 నాటికి చేరుకోవాల్సిన టార్గెట్‌ని 11 ఏళ్ల ముందేగానే 2023లో చేర్చిన ఘనత కేసీఆర్ నాయకత్వానిది. ఢిల్లీకి డబ్బు సంచులు పంపకుండానే తెలంగాణ విత్తన భాండాగారమైంది. దేశంలోనే ధాన్య సిరిగా మారింది. పేదల కంట కన్నీరు లేకుండానే పారిస్, బొగొటా, మెక్సికో సిటీ, మోంటేరియల్‌ను అధిగమించి ప్రపంచంలోనే అత్యుత్తమ గ్రీన్ సిటీ అవార్డును హైదరాబాద్ దక్కించుకుంది. మూసీ నదికి అటు ఇటు అభివృద్ధి, ఆకాశ హర్మ్యాలు కడుతున్నప్పుడు మరి ఫోర్త్ సిటీ ఎందుకు?. మూసీ పక్కన పెట్టుబడి పెట్టేందుకు ఫోర్ బ్రదర్స్ మనీ స్పిన్నింగ్ కోసమా?. ఫ్యూచర్ సిటీ అని పొంకణాలు ఎందుకు ?. కుర్చీలో కూర్చుంటేనో, సమావేశాల్లో తల కిందకీ మీదకీ తిప్పితేనో అభివృద్ధి జరగదు. ప్రభుత్వ పాఠశాలలో చదువుకున్నా అంటూ ప్రభుత్వ బడి పిల్లల పరువు తీయకు. కేసీఆర్ ప్రారంభించిన గురుకులాల్లో చదువుకున్న విద్యార్థులు అద్భుతమైన ఇంగ్లీష్ మాట్లాడతారు. ప్రపంచవ్యాప్తంగా గొప్ప గొప్ప ఉద్యోగాలు చేస్తున్నారు' అని కేటీఆర్ అన్నారు.

# హస్తం గూట్లో వ్యస్తం..

ఎమ్మెల్యే, జంపింగ్ జపాంగ్ లను బట్టలు ఊడబీకి తరుముతాం అంటున్న నెల్లికుదురు కాంగ్రెస్ సీనియర్ శ్రేణులు

పగులుతున్న సీనియర్ కాంగ్రెస్ నాయకుల కార్యకర్తల గుండెలు



**తొలి సమయం ప్రధాన ప్రతినిధి మహబూబాబాద్ అక్టోబర్ 18:** కలిసి వస్తే నడిసొచ్చే కొడుకు పుడతాడు అంటారు పెద్దలు. పిలిచి పిల్లనిస్తే అల్లుడికి చులుకనైనట్టు అనే సామెత లాగా ఉన్నది మానుకోట జిల్లా కాంగ్రెస్ పరిస్థితి.. టిఆర్ఎస్ దోపిడికి వ్యతిరేకంగా తిరగబడ్డ జనానికి, రేవంత్ రెడ్డి మాటల తూటాలు, రాహుల్ జూడో యాత్ర తోడయ్యింది. 50 వేల పైచిలుకు ఓట్లతో మానుకోట నియోజకవర్గంలో. కాంగ్రెస్ జెండాను ఊరురూ,పల్లె పల్లె రెపరెపలాడించారు అలాంటి తిరుగుబాటు ఉద్యమ రూపంగా గెలిచిన కాంగ్రెస్ పార్టీ జనాన్ని గెలిపించిన నాయకులను. గెలిచాక పక్కన పెట్టేస్తోంది అని ఆరోపణలు వినబడుతున్నాయి,చీమలు పెట్టిన పుట్టలో పాములు దూరినట్లు, కొత్త సీసాలో పాత సారాయి లాగా కాంగ్రెస్ గూట్లోకి. టిఆర్ఎస్ వలస రాబందులు చేరాయిఅని, నియోజకవర్గంలోని కాంగ్రెస్ శ్రేణులు నిప్పులు జరుగుతున్నారు. కాంగ్రెస్ శ్రేణులు జనం కష్టపడి గెలిపిస్తే, పార్టీ శ్రేణులకు కార్యకర్తలకు సంబంధం లేకుండా తమాషాలు చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ మురళి నాయక్, మరియు బిఆర్ఎస్ నుండి కాంగ్రెస్ లోకి వచ్చిన బిఆర్ఎస్ జంపింగ్ లను బట్టలూడదీసి, పొలిమేర దాటిస్తామని నెల్లికుదురు మండలంలోని సీనియర్ కాంగ్రెస్ కార్యకర్తలు హెచ్చరికలు చేస్తున్నారు.

వివరాల్లోకెళ్తే.. పథకాలు అర్హత కలిగిన పేదలకు చేరాలి అనే ఉద్దేశంతో నీతిమంతులతో కూడుకున్న ఇందిరమ్మ కమిటీ నిర్మాణాలకు సెలవిచ్చింది అధిష్టానం,ఏడుగురు సభ్యులతో కూడుకున్న ఇందిరమ్మ కమిటీని కాంగ్రెస్ శ్రేయోభిలాషులు, నాయకులు కార్యకర్తల సమన్వయంతో వేయాలి అనేది అధిష్టానం ఉద్దేశ్యం, కానీ మానుకోట నియోజకవర్గంలో అందుకు విరుద్ధంగా జరుగుతోందని. కడుపు మంటతో రగిలిపోతున్నారు. కాంగ్రెస్ శ్రేణులు. కష్టపడ్డది ఎవరు ప్రతిపక్షంగా ధర్నాలు రాస్తారోకోలు చేసింది ఎవరు?. టిఆర్ఎస్ ప్రజా వ్యతిరేక విధానాలపై గుంతెత్తింది ఎవరు! కష్టపడి పోరాటం చేసింది ఎవరు! అవేమీ పరిగణలోకి తీసుకోకుండా.. బిఆర్ఎస్ అవినీతి సొమ్ముని కడుపునిండా ఆరగించిన ఉత్త అవినీతి సత్రోలు శరీరాలు ఆయారామ్ గయారామ్ లనే మళ్లీ ముందు పెట్టి ఇందిరమ్మ కమిటీలను వేస్తున్నారని అగ్గి మీద గుగ్గిలం అవుతున్నారు, నెల్లికుదురు మండలంలోని సీనియర్ కాంగ్రెస్ నాయకులు మాజీ జెడ్పిటిసి. సిహెచ్ వెంకటేశ్వర్లు, బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, దివంగత సీనియర్7 కాంగ్రెస్ నాయకులు కొమ్మాల్ రెడ్డి తనయుడు యాదవ రెడ్డిలు. వీరిద్దరితోపాటు నెల్లికుదురు మండల అధ్యక్షులు మీడియావేదికగా మాట్లాడుతూ.. ఎమ్మెల్యే మురళి నాయక్. టిఆర్ఎస్ పార్టీలో ఇసుక దందా. గుట్కా దందా గంజాయి దందా. కాంట్రాక్టు మాఫియా జోక్యంతో వేసిన ఇందిరమ్మ కమిటీలను రద్దు చేయాలని డిమాండ్ చేస్తున్నారు , వ అలాకాకుండా వైఖరిమార్చుకోకుండా ఉంటే, బట్టలు ఊడదీసి పొలిమేర దాటిస్తాం అని హెచ్చరిక చేస్తున్నారు ఇది ఇలా ఉండగా కాంగ్రెస్ పార్టీ గత పది ఏళ్లు అధికారాన్ని కోల్పోగా తిరిగి ప్రజలు ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని.. మౌలికమైన పార్టీ నిర్మాణానికి నడుము కట్టాలని ప్రజలు కోరుకుంటున్నారు.. ఇటీవల ఉద్యోగులకు నియామక పత్రాలు ఇస్తూ మంచి యువకులను. నాయకులను అందించండి అని సందేశం ఇచ్చారు. కానీ అందుకు విరుద్ధంగా మానుకోటలో జరగడం గమనార్హం, అయితే ప్రజలు టిఆర్ఎస్ పది సంవత్సరాల సమయం ఇచ్చారు,ప్రజల ఆకాంక్షలు నెరవేర్చకపోగా రాష్ట్రాన్ని అప్పుల చిప్పగా చేసి కాంగ్రెస్ కు ఇచ్చారు. ప్రజలుఆ పార్టీని ఓడించడానికి ప్రజలకు పదేళ్లు అవకాశం ఇచ్చారు.. కానీ కాంగ్రెస్ పార్టీని ఇంటికి పంపించడానికి ఇలాగే ప్రవర్తిస్తే మూడేళ్లు కూడా దాటనివ్వరని హెచ్చరిక చేశారు మానుకోట కాంగ్రెస్ లో కార్యకర్తలు సీనియర్ నాయకులు. కాంగ్రెస్ శ్రేయోభిలాషుల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకోకుండా మళ్లీ కొత్త సీసాలో పాత సారాయిలాగా.. చీమలు పెట్టిన పుట్టలో పాములు దూరినట్లు మళ్లీ కాంగ్రెస్ గూట్లోకి టిఆర్ఎస్ వలస రాబందులు చేరుతున్నారని, నిరసన గళాలు వినిపిస్తున్నారు, సంస్థ గత ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని వ్యక్తుల చుట్టే తిప్పుకునే కాంగ్రెస్ పార్టీ నష్టపోవడానికి దోహదం చేస్తుందని, కాంగ్రెస్ పార్టీ అన్ని మండలాల్లోని సీనియర్లు కార్యకర్తలు భిన్నాభిప్రాయాలు, ఆరోపణలు కొనసాగుతున్నాయి..

## పీసా గ్రామసభ ద్వారా ఇందిరమ్మ ఇండ్ల ఎంపిక ప్రక్రియ జరగాలని తాహసీల్దార్‌కి వినతి పత్రం

### గొండ్వాన సంక్షేమ పరిషత్

### ఏజెన్సీ చట్టాలను నిర్వీర్యం చేస్తే చూస్తూ ఊరుకునేది లేదు... జిఎస్పి రాష్ట్ర కార్యదర్శి పూనెం సాయి

**తొలి సమయం నూగురు వెంకటాపురం, అక్టోబర్ 18**
వెంకటాపురం మండల కేంద్రంలో ఏజెన్సీ చట్టాలకు అనుగుణంగా ప్రభుత్వాలు చెయ్యాలని, ఇందిరమ్మ ఇండ్ల ఎంపిక ప్రక్రియ పిసా గ్రామసభ తీర్మానంతో జరపాలని జిఎస్పి రాష్ట్ర కార్యదర్శి పూనెం సాయి డిమాండ్ చేశారు. శుక్రవారం నాడు వెంకటాపురం మండల తాసిల్దార్ లక్ష్మి రాజయ్యకి గొండ్వాన సంక్షేమ పరిషత్ ఆధ్వర్యంలో పిసా గ్రామ సభలు ఏజెన్సీ గ్రామాలలో పూర్తిస్థాయిలో జరపాలని ,పీసా గ్రామసభ ద్వారా ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపిక జరగాలని మెమొరాండం ఇవ్వడం జరిగింది,అనంతరం పూనెం సాయి తాహిసీల్దార్ కి వివరిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన ఇందిరమ్మ ఇండ్ల ఎంపిక ప్రక్రియ సరైన పద్ధతి కాదని,రాజ్యాంగంలో పొందుపరచిన ఆర్టికల్ (342) ప్రకారంగా 1/70 చట్టాన్ని అనుసరించి ఏజెన్సీ ప్రాంతంలో పూర్తి హక్కులు పిసా గ్రామ సభలకే ఉంటుందని, లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ కీలక పాత్ర పిసా గ్రామసభలకే ఉంటుందని ఆయన అన్నారు.అధికార యంత్రాంగం కూడా ఏ మాత్రం ఏజెన్సీ ప్రాంత చట్టాలు పట్టించుకోకుండా వ్యవరిస్తున్నారని వాపోయారు.ఏజెన్సీ చట్టాలకు విరుద్ధంగా పని చేయడం సరైన పద్ధతి కాదనీ ఆయన మండిపడ్డారు. ఈ విషయంపై జిల్లా కలెక్టర్లు రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్ళలని కోరారు.ఏజెన్సీ ప్రాంతంలో 33 జీవో లో కలిగిన మార్పులు పెసా చట్టానికి అనుగుణంగా మార్చాలని పూనెం సాయి డిమాండ్ చేశారు.ఏజెన్సీ ప్రాంతాల్లో మొదటి ప్రాధాన్యత ఆదివాసి కుటుంబాలకి ఇవ్వాలని అన్నారు. గత ప్రభుత్వ డబుల్ బెడ్ రూం ఇండ్ల పేరుతో పూర్తిగా బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తలకు పంపిణీ చేసిందని, ఏ ఒక్క ఆదివాసి డబుల్ బెడ్ రూం ఇండ్లు ఇవ్వలేదని ఆయన తెలిపారు.అదే తప్పు చెయ్యకుండా పీసా గ్రామసభ ద్వారా ఇందిరమ్మ ఇండ్ల ఎంపిక చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ




కార్యక్రమంలో ములుగు జిల్లా ప్రధాన కార్యదర్శి కణితి వెంకటకృష్ణ కార్యనిర్వాహక అధ్యక్షులు పూనెం ప్రతాప్ పాల్గొన్నారు.

## దళితబంధుపై స్పష్టత ఇవ్వాలి

### - లేదంటే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఈ ప్రభుత్వనికి తగిన గుణపాఠం చేప్పడం కాయం




**తొలి సమయం, హైదరాబాద్, అక్టోబర్ 18**
హైదరాబాద్ లోని ప్రజాదర్బార్ ప్రజాపాలన కార్యక్రమనికి రెండవ విడత దళితబంధు నిధులు మంజూరు చేయాలనీ దళితబంధు సాధన సమితి హుజురాబాద్ నియోజకవర్గం నుండి సుమారుగా 300మంది బాధితులు ప్రజాధర్బార్ లో దరఖాస్తు చేయడం జరిగింది.ఈనెల 23న జరగబోయే కాబినెట్ సమావేశం సమావేశంలో దళితబంధు పై స్పష్టమైన ప్రకటన చేయాలనీ డిమాండ్ చేయడం జరిగింది. గత 10నెలలుగ అనేక కార్యక్రమలు చేసిన ప్రభుత్వం స్పందించడం లేదు గత నెల 16న ఖమ్మంలో జిల్లా చింతకాని లో దళితబంధు మంజూరు చేసిన ఉప ముఖ్యమంత్రి మరి హుజురాబాద్ నియోజకవర్గం వాళ్లకు ఎప్పుడు ఇస్తారో కూడా చెప్పాలని డిమాండ్ చేస్తున్నాం అని ఈరోజు క్యాబినెట్ మీటింగ్ లో ముఖ్యమంత్రి లేదా ఉప ముఖ్యమంత్రి దళితబంధు రెండవ విడత నిధులు ఎప్పుడు మంజూరు చేస్తారో తెలపాలని లేనిపక్షంలో రానున్న రోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న దళితులను ఏకం చేసి స్థానిక సంస్థల ఎన్నికల్లో ఈ ప్రభుత్వనికి తగిన గుణపాఠం చేప్పడం కాయమని తెలిపారు. ఈ కార్యక్రమంలో దళితబంధు సాధన సమితి రాష్ట్ర సభ్యులు కొగిలా మహేష్,పిచ్చయ్య, హుజురాబాద్ సాధన సమితి సభ్యులు కోలుగూరి సురేష్, కోలుగూరి నరేష్,ఇనుగాల బిక్షపతి, అకినాపెళ్ళి ఆకాష్,మహంకాళి రమేష్,సరిగమ్ముల విజయ్,ఎల్కపల్లి ఉదయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## మైనారిటీ గురుకుల పాఠశాలను సందర్శించిన కలెక్టర్ ప్రావీణ్య

**తొలి సమయం, హన్మకొండ, అక్టోబర్ 18**
హనుమకొండ జిల్లా కాజీపేట మండలం కడిపికొండ లోని తెలంగాణ రాష్ట్ర మైనారిటీ గురుకుల పాఠశాలను జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య శుక్రవారం సందర్శించారు. గురుకుల పాఠశాలలోని విద్యార్థుల సంఖ్యతో పాటు ఏకరూప దుస్తులు, టెక్స్ట్, నోట్ బుక్స్ పంపిణీ గురించిన వివరాలను ప్రిన్సిపల్, ఉపాధ్యాయులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా పాఠశాలకు





సంబంధించిన పలు రికార్డులను కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ పాఠశాలలో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూసుకోవాలని అన్నారు. ఏవైనా ఇబ్బందులు ఉన్నట్లయితే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. పాఠశాలలో ఏవైనా సమస్యల పరిష్కారానికి సంబంధించి ప్రతిపాదనలు అందజేస్తే చర్యలు తీసుకోనున్నట్లు పేర్కొన్నారు.

కల్తీ విత్తనాలు అమ్మిన వ్యాపారస్తుల పై

## చర్యలు తీసుకోవాలి

- రైతులకు నష్టపరిహారం ఇవ్వాలి
- ఏఐకేఎంఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు జడ సత్యనారాయణ




**తొలి సమయం మహబూబాబాద్ అక్టోబర్ 18:**
మొక్కజొన్న కల్తీ విత్తనాలు అమ్మిన వ్యాపారులపై వెంటనే చర్యలు తీసుకొని రైతులకు నష్టపరిహారం అందివ్వాలని ఏఐకేఎంఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు జడ సత్యనారాయణ డిమాండ్ చేశారు. బయ్యారం మండల రెవెన్యూ కార్యాలయం ముందు ఏఐకేఎంఎస్ ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమం నిర్వహించారు.. ఈ సందర్భంగా ఏఐకేఎంఎస్ ఉపాధ్యక్షులు జడ సత్యనారాయణ మాట్లాడుతూ.. బయ్యారం మండలంలోని ఏజెన్సీలో మొక్కజొన్న తో పాటు వరి, పత్తి ప్రధాన పంటలు అన్నారు. గిరిజనులు గిరిజన ఇతరులు మొక్కజొన్నను విస్తారంగా పండిస్తారు అన్నారు ఈ అంశాన్ని ఆసరాగా చేసుకొని గిరిజన రైతులకు కల్తీ విత్తనాలు అంటగట్టి రైతులకు తీవ్ర నష్టం కలిగించారని అన్నారు రైతులు వేలాది రూపాయలు వడ్డీకి తెచ్చి పెట్టుబడి పెట్టారని, మొక్కజొన్న కంకులు రాక దిగుబడి లేని పరిస్థితి ఎదురైందని అన్నారు. దెబ్బతిన్న పంటలను వ్యవసాయ అధికారులు కనీసం పర్యవేక్షణ చేయకపోవడం ఘోరమైన దారుణం అన్నారు, వెంటనే నకిలీ విత్తనాలు అమ్మిన వ్యాపారస్తులపై చర్యలు తీసుకొని నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు, అకాల వర్షాల వల్ల నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలని అన్నారు ధర్నా అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని రెవెన్యూ అధికారికి అందించారు ఈ కార్యక్రమంలో మండల ఏఐకేఎంఎస్ అధ్యక్ష కార్యదర్శులు రామగిరి బిక్షం బానోతు నరసింహ మేకపోతుల నాగేశ్వరరావు మురళీకృష్ణ, గంగారం బిక్షం శివారపు శ్రీధర్ నేతగాని రాకేష్ భువనగిరి మధు చైతన్య తదితరులు పాల్గొన్నారు

### తెలుగు సమితి ఆఫ్ నేబ్రాస్కా సొసైటీ, స్ఫూర్తి ఎడ్యుకేషన్ ఫౌండేషన్ వారిచే క్రీడా దుస్తుల పంపిణీ







**తొలి సమయం, గూడూరు అక్టోబర్ 18:**
స్ఫూర్తి ఎడ్యుకేషన్ సొసైటీ సమితి వారి ఆధ్వర్యంలో గూడూరు మండలం ఈగలవేణి జెడ్పిహెచ్ ఎస్ స్కూలు విద్యార్థిని విద్యార్థులకు. తెలుగు సమితి ఆఫ్ నేబ్రాస్క సొసైటీ వారిచే.. క్రీడా దుస్తుల పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా స్కూల్ హెచ్ఎం మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలో చదువుకునే పేద విద్యార్థుల పట్ల స్ఫూర్తి ఎడ్యుకేషన్ సొసైటీ అండ్ తెలుగు సమితి ఆఫ్ నేబ్రస్కా వారు చూపించే ఔదార్యానికి కృతజ్ఞతలు అన్నారు.. అదేవిధంగా స్ఫూర్తి ఫౌండేషన్ వ్యవస్థాపకులు రామసాయం శ్రీధర్ మాట్లాడుతూ.. ప్రత్యేకించి ప్రభుత్వ పాఠశాలలో చదివే పేద విద్యార్థులకు సహాయ సహకారాలు అందించడమే ధ్యేయంగా ఈ సంస్థలు కొనసాగుతున్నాయని అన్నారు. పిల్లలు క్రీడల్లో రాణించి రాష్ట్ర జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని కోరారు,చదువులతో పాటు పిల్లలు క్రీడల్లో రాణించాలనే లక్ష్యం ఈ సేవా కార్యక్రమంలో ఇమిడి ఉన్నది. అన్నారు ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి మేకల కృష్ణయ్య ఉపాధ్యక్షులు ధర్మానాయక్, జె పురుషోత్తం గౌడ్ పి సిహెచ్ సంపత్ ఈ నాగరత్నం ఆర్ రాంప్రసాద్, ఏ రవి ఎండి రఫీ యు లక్ష్మయ్య జీ,రాణి పి మహేందర్ పిడి నాగమణి విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## పిడుగు పాటకు మహిళ మృతి



**తొలి సమయం,మహబుబాబాద్ అక్టోబర్ 18:** పిడుగుపాటుకు మహిళ మృతి చెందిన సంఘటన సీరోలు మండలం అందనాలపాడు గ్రామంలో వెలుగు చూసింది వివరాల్లోకి వెళితే.. తమ వ్యవసాయక్షేత్రంలో పనిచేస్తుండగా సాయంత్రం 5 గంటలకు పిడుగుపాటుకు పోతరాజు వెంకటరమణ(43) అనే మహిళ మృతి..

ఇల్లందులో జర్నలిస్ట్ పై దాడి ఘటనలో

## ఏడుగురిపై కేసు నమోదు...




**తొలి సమయం భద్రాద్రి కొత్తగూడెం అక్టోబర్18:**
ఇల్లందులో జర్నలిస్ట్ నిట్ట సుదర్శన్ పై మండలంలోని జగదాంబగుంపులో జరిగిన దాడి చేసిన సంఘటన చోటుచేసుకుంది వెంటనే స్పందించిన సిఐ బత్తుల సత్యనారాయణ ఏడుగురుపై కేసు నమోదు చేశారు. జగదాంబ గుంపులోని చాయ్ షాప్ వద్దకు వచ్చిన సుదర్శన్ పై వంశీ, ప్రేమ్, ఉదయ్, యాకూబ్ లు అకారణంగా బీరుబాటిల్ తో, కర్రలతో దాడి చేశారు. గాయాలైన సుదర్శన్ ను స్థానికులు ప్రభుత్వ వైద్యశాలకు తీసుకువెళ్లారు. విషయం తెలుసుకున్న సిఐ సత్యనారాయణ సుదర్శన్ ను పరిశీలించి ఆయన వాంగ్మూలంతో కేసు నమోదు చేశారు. దాడి చేసిన వారితోపాటు, వారికి సహకరించిన అనిల్, ప్రసాద్, నాగేశ్వరరావు లపై పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు ఇంకా తెలవాల్సినది.

# రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ధాన్యం కొనుగోలు ప్రక్రియ

## వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు





**తొలి సమయం,హన్మకొండ, అక్టోబర్ 18** రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోలు ప్రక్రియను ప్రభుత్వం చేపడుతుందని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్. నాగరాజు అన్నారు. శుక్రవారం గ్రేటర్ వరంగల్ పరిధిలోని కడిపికొండలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని హనుమకొండ జిల్లా కలెక్టర్ ప్రావీణ్య తో కలిసి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు మాట్లాడుతూ రైతులకు రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. రెండు లక్షల రూపాయల రైతు రుణమాఫీ చేసిన దేశంలోని ఏకైక ప్రభుత్వం మనదని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అంటేనే బడుగు బలహీన వర్గాలు, రైతుల పక్షపాతి ప్రభుత్వం అని పేర్కొన్నారు. రాష్ట్రంలోని ఏ ఒక్క రైతు కూడా ధాన్యం విషయంలో మోసపోకుండా ఉండేందుకు ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందన్నారు. రైతులు ఏవైనా సమస్యలు ఉన్నట్లయితే కంట్రోల్ రూమ్ కు ఫోన్ చేయవచ్చునని అన్నారు. రైతులను ఆదుకునేందుకు జిల్లా కలెక్టర్ తో కలిసి తనవంతు కృషి చేస్తానన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సన్న రకం ధాన్యానికి రూ. 500 లను బోనస్ ఇవ్వడం సంతోషకరమైన విషయం అన్నారు. ఈ విషయాన్ని రైతులందరూ గుర్తుంచుకోవాలన్నారు. సన్న రకం ధాన్యాన్ని ఎన్ని క్వింటాలు పండిస్తే అన్ని క్వింటాలును కొనేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. దొడ్డు సన్న రకం ధాన్యాలను కొనుగోలు చేసేందుకు ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద ప్రత్యేక ఏర్పాట్లను చేసినట్లు తెలిపారు. రైతులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా ఉండేందుకు దొడ్డు, సన్న రకం దాన్యం కొనుగోలుకు ఏర్పాట్లను పూర్తిచేయాలని అధికారులను ఆదేశించినట్టు తెలిపారు. రూ. 25 వేల కోట్ల నిధులను ప్రభుత్వం సమకూర్చిందని, రైతులు ధాన్యం అమ్మిన కొద్ది రోజుల్లోనే రైతుల ఖాతాల్లో జమ చేసేందుకు కృషి చేస్తుందన్నారు. ఇందుకు రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారని అన్నారు. గురుకులాల్లో చదువుతున్న విద్యార్థులకు సన్న బియ్యం అందుబాటులో ఉంటుందన్నారు. 9 నెలల్లోనే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రూ. 18 వేల కోట్ల రుణమాఫీ చేసి ఇంకా మూడు నాలుగు నెలల్లో మరో రూ. 12 కోట్లను అందించడానికి సిద్ధంగా ఉందన్నారు. 43 లక్షల మంది రైతులకు రూ. 30 వేల కోట్ల రుణమాఫీ చేసిన ఏకైక ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వమని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు అండగా ఉంటుందన్నారు. పంటల సాగుకు నాణ్యమైన కరెంటును ప్రభుత్వం అందిస్తుందన్నారు. రైతులు విద్యుత్తు సమస్యతో ఇబ్బంది పడకుండా ఉండేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అదేవిధంగా ప్రభుత్వ పాఠశాలల్లో ఎలాంటి సమస్యలు ఉన్నా కూడా దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ప్రతి హాస్టల్ ను సందర్శించి అక్కడ నెలకొన్న సమస్యలను వీలైతే సొంత డబ్బులను ఖర్చు పెడుతున్నట్లు తెలిపారు. స్పోర్ట్స్ విలేజ్ ఏర్పాటు చేయడం వలన విద్యార్థులు ఆటలువైపు దృష్టి సారిస్తారని అన్నారు. ఈ సందర్భంగా హనుమకొండ జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య మాట్లాడుతూ హనుమకొండ జిల్లాలోని ప్రతి మండలంలో శుక్రవారం ఒక ధాన్యం కొనుగోలు కేంద్రం తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని ఆదేశించినట్లు తెలిపారు. వరి కోతలకు హార్వెస్టర్ యంత్రాల కొరత లేకుండా ఉండేందుకు వాటి యజమానులతో మాట్లాడినట్లు



పేర్కొన్నారు. వరి కోతలకు హార్వెస్టర్ల వినియోగంతో ఎలాంటి తరుగు లేకుండా వస్తుందని అన్నారు. రైతులతో కూడా అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈసారి ధాన్యం కొనుగోలు కేంద్రాలలో వేరువేరుగా సన్న, దొడ్డు రకం ధాన్యం కొనుగోలు చేస్తున్నట్లు చెప్పారు. వ్యవసాయ శాఖ నుండి ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి తెలుపు, నీలిరంగు టోకెన్లను ఇవ్వాలని ఏఈఓ లను ఆదేశించినట్లు పేర్కొన్నారు. ధాన్యం కొనుగోలు సంబంధించి రైతులకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు ఇండ్ల నాగేశ్వర్ రావు, అనిత రంజిత్, దర్గా కాజీపేట పిఎసిఎస్ చైర్మన్ వనం రెడ్డి, డి సిఓ నీరజ, జిల్లా పౌరసరఫరాల అధికారి ఉమారాణి, వ్యవసాయ శాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# కొండగట్టు జేఎన్టీయూ కాలేజీని యూనివర్సిటీగా తీర్చిదిద్దేందుకు కృషి

**నిరుద్యోగ నిర్మూలనే లక్ష్యంగా పనిచేస్తా**

**ప్రైవేటు ఉద్యోగులకు హెల్త్ కార్డుల మంజూరికి ప్రయత్నిస్తా**

**జగిత్యాల్ జిల్లా కేంద్రంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి అల్ఫోర్స్ డాక్టర్ వి నరేందర్ రెడ్డి విస్తృత ప్రచారం**





**తొలి సమయం, జగిత్యాల, అక్టోబర్ 18**
ఉత్తర తెలంగాణకు తలమానికంగా ఉన్న కొండగట్టు జేఎన్టీయూ ను యూనివర్సిటీగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానని. నిరుద్యోగ నిర్మూలనే ధ్యేయంగా పనిచేస్తానని పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి అల్ఫోర్స్ డాక్టర్ వి నరేందర్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం జగిత్యాల జిల్లా కేంద్రంలో విస్తృతంగా పర్యటించారు. మినీ స్టేడియం,రామాలయం గ్రౌండ్, మునిసిపల్ పార్క్ లో ఎస్ కె ఎన్ అర్ మైదానంలో వాకర్స్ తో ముఖాముఖి నిర్వహించి అనంతరం ఓ హొటల్ లో పట్టభద్రులను కలిసి రానున్న పట్టభద్రుల ఎన్నికల్లో తనకు మద్దతు తెలిపాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న పట్టభద్రుల ఎన్నికల్లో తనను గెలిపిస్తే నిరుద్యోగ, ప్రభుత్వ ప్రైవేటు ఉద్యోగుల సమస్యలపై పోరాడుతానని పెద్దల సభలో చట్టాల రూపకల్పనలో ముందుంటానని నిరుద్యోగ యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించడమే ప్రథమ కర్తవ్యం కృషి చేస్తానని అన్నారు.... రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు పెండింగ్ లో ఉన్న డి ఏ ల మంజూరి విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరిస్తానని అన్నారు.ప్రైవేటు ఉద్యోగులకు హెల్త్ కార్డుల మంజూరికి కృషి చేస్తానని అన్నారు



# టాపర్స్ అండ్ డెఫినిటీ అకాడమీ కోచింగ్ సెంటర్ ప్రారంభం





**తొలి సమయం, హన్మకొండ, అక్టోబర్ 18**
హనుమకొండ లోని కిషన్ పుర లో టాపర్స్ డెఫినిటీ ఐఐటి అండ్ నీట్ అకాడమీ సంస్థను ఘనంగా ప్రొఫెసర్ ఎస్ జ్యోతి ప్రిన్సిపాల్ ఆక్స్ఫర్డ్ కాలేజీ టాపాస్ డెస్టిని సెంటర్ హెడ్ చర్ల రాజి రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రిన్సిపల్ ఎస్ జ్యోతి తన పద్ధతులతో బోధన సిబ్బందితో పిల్లల ఉజ్వల భవిష్యత్తు కోసం స్థాపించడం జరిగిందని పేర్కొన్నారు.చాలా ఆధ్యాత్మిక విధానంలో విద్యను అందించడం అభినందనలు అని కొనియాడారు. వరంగల్ రైతు సిటిలో అత్యధిక పద్ధతులతో స్మార్ట్ బోర్డ్ డిజిటల్ సెంటర్ కోట ఫ్యాక్టరీ చేత ఆరవ తరగతి నుండి ఇంటర్మీడియట్ వరకు చదువుకుంటున్న విద్యార్థులకు ఐఐటి అండ్ నీట్ ఫౌండేషన్ అందించడమే లక్ష్యంగా నెలకొల్పడం జరిగింది అని తెలిపారు.తరగతిలో పరిమిత సంఖ్యను విద్యార్థులతో పాటు రెగ్యులర్గా ఎగ్జామ్స్ నిర్వహిస్తూ సబ్జెక్టులను నెరవేర్చడం కోసం అన్ని వసతులు కల్పించడం జరిగిందని ఈ ఫౌండేషన్ అకాడమీ నందు షిఫ్టులుగా క్లాసులు నిర్వహిస్తుంది. ఉదయం ఐదు గంటల నుండి ఏడు గంటల 30 నిమిషాల వరకు సాయంత్రం 6 గంటల నుండి 8:30 వరకు నిర్వహిస్తునమాని కావున విద్యార్థుల తల్లిదండ్రులు మా అకాడమీ ని సందర్శించి మీ పిల్లల లక్ష్యాలను నెరవేర్చుకోవాలని విన్నవించారు. ఈ కార్యక్రమంలో చల్లా శ్రీలత,సువర్లచ వినూష,అనిత,మధుకర్ పాల్గొన్నారు. చాలా మంది విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొని అకాడమీ బాగుందని తెలిపారు.

# వయనాడ్‌లో రంగంలోకి సిపిఐ అభ్యర్థి

**తిరువనంతపురం,అక్టోబర్18:** వయనాడ్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీ చేయనున్న ప్రియాంక గాంధీ పై సిపిఐ అభ్యర్థిని నిలపనుంది. కేరళలోని వాయనాడ్ నుంచి ప్రియాంక పోటీ చేస్తున్న సంగతి తెలిసిందే. వామపక్షాలు సీనియర్ సిపిఐ నాయకుడు, మాజీ శాసనసభ్యుడు సత్యన్ మోకెరి(70)ని పోటీకి నిలబెట్టింది. రాహుల్ గాంధీ తన వాయనాడ్ సీటును ఖాళీ చేయడంతో ఆ సీటుకు ఇప్పుడు ఉపఎన్నిక జరుగబోతున్నది. అయితే గమనించాల్సిన విశేషమేమిటంటే ఇది ప్రియాంక గాంధీ తొలిసారి పోటీ చేస్తున్న ఎన్నికల ఘట్టం. సిపిఐ స్టేట్ కౌన్సిల్ గురువారం సమావేశమై సత్యన్ మోకెరి విషయంలో నిర్ణయం తీసుకుంది. ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి బినయ్ విశ్వం మాట్లాడుతూ ' మోకెరి పూర్తి స్థాయిలో పోటీపడతారు. ఆయన దేశంలో జరిగిన అనేక రైతు ఉద్యమాలకు నాయకత్వం వహించారు. మేము సీనియర్ రైతు నాయకుడిని ఎల్ డిఎఫ్ అభ్యర్థిగా వాయనాడ్ నుంచి నిలబెడుతున్నాము' అన్నారు.మోకెరి ప్రస్తుతం ఆల్ ఇండియా కిసాన్ సభకు జాతీయ కార్యదర్శిగా ఉన్నారు. అది సిపిఐ రైతు విభాగం. పైగా మోకెరి కొజికోడ్ జిల్లాకు చెందిన స్థానిక వాసి. ఆయన 1987 నుంచి 2001 వరకు మూడుసార్లు శాసనసభ్యుడిగా పనిచేశారు. ఆయన నందపురం అసెంబ్లీ సీటు కు ప్రాతినిధ్యం వహించారు. మోకెరి పార్టీ విద్యార్థి విభాగం 'ఆల్ ఇండియా స్టూడెంట్ ఫెడరేషన్' నుంచి పార్టీలో చేరారు.

## నిజాయితీగా పనిచేయండి

# మీకు అండగా నిలుస్తా

**వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా**





**తొలి సమయం**
**హన్మకొండ అక్టోబర్ 18**
నిజాయితీ తో విధులు నిర్వహిస్తూ, పోలీస్ శాఖ కు కీర్తి ప్రతిష్ఠలు తీసుకవచ్చే పోలీస్ సిబ్బందికి అండగా నిలుస్తానని వరంగల్ పోలీస్ కమిషనర్ సిబ్బంది సూచించారు. వర్ధన్నపేట ఏసీపీ కార్యాలయం తనిఖీ వచ్చిన పోలీస్ కమిషనర్ కార్యాలయ, పోలీస్ స్టేషన్ సిబ్బందితో ముచ్చటించారు. ఈ సందర్భంగా వారి సాధక భాధలను పోలీస్ కమిషనర్ అడిగితెలుసుకున్నారు. అనంతరం పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ సిబ్బంది వ్యక్తిగత, శాఖపరమైన సమస్యలు వుంటే ప్రతి శనివారం రోజున కమిషనరేట్ కార్యాలయంలో తనను వ్యక్తిగతంగా కలుసుకొని తమ సమస్యలు తెలియజేయవచ్చని, అలాగే ఇందుకోసం పోలీస్ కంట్రోల్ రూం లో ప్రత్యేకంగా పోలీస్ అధికారిని నియమించడం జరిగిందని.. అలాగే సిబ్బంది ఆరోగ్య పరిరక్షణలో భాగంగా రేపు ఉచిత మెగా హెల్త్ క్యాంపు ఏర్పాటు చేయడం జరిందనిఈ క్యాంపు ను సిబ్బంది వారి కుటుంబ సభ్యులు వినియోగంచు కోవాలని పోలీస్ కమిషనర్ సిబ్బందికి తెలిపారు.

# వర్కింగ్ జర్నలిస్టులందరికీ ఇండ్ల స్థలాలు మంజూరు చేయాలి

**డిజెఎఫ్ అధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయంలో వినతి పత్రం అందజేత**

**అక్రెడిటేషన్ పేరుతో జరుగుతున్న వివక్షను అరికట్టాలి**

**అక్రిడిటేషన్ తో సంబంధం లేకుండా అన్ని ప్రభుత్వ రాయితీలలో ప్రాధాన్యత ఇవ్వాలి**

**డిజెఎఫ్ సిద్దిపేట జిల్లా అధ్యక్షులు పొన్నాల రవీందర్**



**తొలి సమయం, సిద్దిపేట,అక్టోబర్ 18**
డిజెఎఫ్ జాతీయ రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు డిజెఎఫ్ సిద్దిపేట జిల్లా కమిటీ ఆధ్వర్యంలో వర్కింగ్ జర్నలిస్టుల సమస్యల పరిష్కారాన్ని కోరుతూ సిద్దిపేట జిల్లా కలెక్టర్ అత్యవసర మీటింగులో ఉండడం వల్ల కార్యాలయ అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ కు డిజెఎఫ్ సిద్దిపేట జిల్లా కమిటీ ఆధ్వర్యంలోని జర్నలిస్టుల బృందం వినతిపత్రం అందజేశారు. ఈ విజ్ఞాపన పత్రంలో అక్రెడిటేషన్ తో సంబంధం లేకుండా వర్కింగ్ జర్నలిస్టులందరికీ ప్రభుత్వం తరుపున ఇండ్ల స్థలాలు/ఇండ్లు మంజూరీ చేయాలని, అక్రిడిటేషన్ పేరుతో జర్నలిస్టుల పట్ల అధికారులు గానీ ప్రజాప్రతినిధులు గానీ వివక్ష చూపకుండా తగు చర్యలు తీసుకోవాలని, ప్రజా సమస్యలను ప్రభుత్వానికి చేరవేసే క్రమంలో జర్నలిస్టులు రాస్తున్న వార్తల పట్ల మింగుడు పడనివారు పెడుతున్న అక్రమ కేసుల నుండి జర్నలిస్టులను కాపాడే విధంగా చర్యలు తీసుకోవాలని, ప్రభుత్వ పరమైన రాయితీలన్నిటినీ ఎలాంటి తారతమ్యం లేకుండా వర్కింగ్ జర్నలిస్టులందరికీ సమానంగా వర్తింపజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిజెఎఫ్ జేపీఎఫ్ రాష్ట్ర కన్వీనర్ చింతకింది సింగరయ్య, సిద్దిపేట జిల్లా అధ్యక్షులు పొన్నాల రవీంధర్, రాష్ట్ర జేపీఎఫ్ కార్యదర్శి బొద్దుల శ్రీనివాస్, జిల్లా ఉపాధ్యక్షులు గుర్రపు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి గొర్ల విజయ్ కుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్ పొన్నాల సంజీవ్, అధికార ప్రతినిధి జీడికంటి సుధాకర్, కోశాధికారి ఎలికట్టె నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

# పట్టభద్రుల సంక్షేమానికి కృషి చేస్తా

**పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి ఆల్ఫోర్స్ అధినేత డాక్టర్ వి నరేందర్ రెడ్డి**



**తొలి సమయం, కరీంనగర్ అక్టోబర్ 18**
పట్టభద్రుల సంక్షేమమే తన ప్రధాన కర్తవ్యమని మరియు యువతకు ఉద్యోగాలు కల్పించడమే లక్ష్యంగా తను రానున్నటువంటి కరీంనగర్-అదిలాబాద్- నిజామాబాద్- మెదక్ పట్టబద్రుల నియోజకవర్గ శాసనమండలి ఎన్నికలలో బరిలో ఉంటున్నానని వారు అలుగునూర్, తిమ్మాపూర్ మరియు ఎల్ఎండి కాలనీ లోని వివిధ విద్యాసంస్థలను సందర్శించిన భాగంగా ముఖాముఖిలో పాల్గొని తెలిపారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టభద్రులకు అన్ని రంగాలలో ప్రాధాన్యం వచ్చే విధంగా కృషి చేస్తానని మరియు పోటీ పరీక్షల సందర్భంగా అండగా ఉండి వారికి సముచిత స్థానం కల్పించడమే కాకుండా వారి సమస్యల పరిష్కారానికి గొప్ప వారిదిగా ఉంటాననిలి లితెలుపుతూ రానున్నటువంటి పట్టబద్రుల ఎన్నికలలో అతి కీలకమైనటువంటి ఓటర్ నమోదు ప్రక్రియలో ప్రతి ఒక్క పట్టభద్రుడు ఓటరుగా నమోదు చేసుకుని నిబద్ధత మరియు అంకిత భావం కలిగిన తనకు ఎన్నికలలో తనకు మద్దతు తెలిపాలని కోరారు.

TEL TEL RNI NO 12283 VEMULA AYODHYA RAMULU TOLI PODDU PUBLICATIONS AND PRINTERS GRAPHICS
H-NO 1-6-155/43/45/4 NANDI NAGAR POST:MANDAL DIST: MAHABUBABAD TELANGANA STATE INDIA PIN CODE 506 101